

ఉరుసు ఉత్సవాలకు ప్రత్యేక బస్సులు


ప్రజాశక్తి - కడప అర్బన్

అమీన్ పీర్ పెద్ద దర్గా ఉరుసు ఉత్సవాలకు ఆర్‌టిసి ప్రత్యేక బస్సులు నడుపుతుందని జిల్లా ప్రజా రవాణా అధికారి పి.గోపాల్ రెడ్డి ఒక ప్రకటన పేర్కొన్నారు. ఈనెల 5 నుంచి 9 వరకు రైల్వే స్టేషన్, ఆర్‌టిసి బస్టాండ్ నుంచి ప్రత్యేక బస్సులు అందుబాటులో ఉంటాయని తెలిపారు. 9న దర్గా నుంచి వాటర్ గండికి ప్రత్యేక బస్సు ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. ఛార్జీ రూ.20 మాత్రమే అని తెలిపారు. ఈనెల 5న కార్తీక పౌర్ణమి పురస్కరించుకుని శైవ క్షేత్రాలకు జిల్లాలోని అన్ని డిపోల నుంచి ప్రత్యేక బస్సులు నడిపేందుకు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ప్రత్యేక బస్సులు ఆయా డిపోల నుంచి వెళ్లడానికి, రావడానికి ఉదయం నుంచి సాయంత్రం వరకు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ప్రజలు సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

'మొంథా'తో దెబ్బతిన్న పంటలకు

నష్టపరిహారం చెల్లించాలి

- కలెక్టర్‌కు సిపిఎం, రైతు సంఘం వినతి



వినతి పత్రం అందజేస్తున్న సిపిఎం, రైతు సంఘం నాయకులు

ప్రజాశక్తి - కడప అర్బన్

జిల్లాలో మొంథా తుపాన్ ప్రభావంతో వరి, అరటి, మినుము, కంది, మొక్కజొన్న, పత్తి, చామంతి పూలు ఇతర వాణిజ్య ఉద్యానవన పంటలు పెద్ద ఎత్తున దెబ్బతిన్నాయని, అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి పంట నష్టాన్ని అంచనా వేసి రైతులకు నష్టపరిహారం వచ్చే విధంగా చూడాలని సిపిఎం, రైతు సంఘం నాయకులు కోరారు. సోమవారం కలెక్టర్ చెరుకూరి శ్రీధర్‌కు ప్రజా ఫిర్యాదుల వేదికలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన తుపాన్ జాబితాలో కడప జిల్లా చేర్చకపోవడం చాలా అన్యాయమని తెలిపారు. బద్వేల్ రెవెన్యూ డివిజన్‌లో 8 మండలాలలో తుపాన్ ప్రభావంతో పంటలకు తీవ్ర నష్టం వాటిల్లిందని చెప్పారు. జిల్లాలో కురిసిన అధిక వర్షాలతో పత్తి, వరి, మొక్కజొన్న, శనగ, మిర్చి వంటి పంటలు దెబ్బతిన్నాయని పేర్కొన్నారు. కోతకు సిద్ధంగా ఉన్న చామంతి పూలు, అరటి, వరి, మొక్కజొన్న పంట, వెన్ను దశలో ఉన్న వరిపంట నేలకొరిగి అపార నష్టం వాటిల్లిందని తెలిపారు. చామంతి పూలు, చెట్లు నిలువునా తడిసిపోయాయని చెప్పారు. దిగుబడి సగానికి సగం తగ్గే అవకాశం ఉందని చెప్పారు. దిగుబడి తగ్గడం, సాగుచేసిన రైతులు, కౌలు రైతులు తీవ్రంగా నష్టపోనున్నారని పేర్కొన్నారు. దెబ్బతిన్న అన్ని పంటలకు తక్షణమే నష్టపరిహారం ఇవ్వవలసిందిగా డిమాండ్ చేశారు. తక్షణమే నష్టం అంచనా వేసేందుకు వ్యవసాయ, రెవెన్యూ, ఉద్యాన శాఖల అధికారులతో బృందాలను వేసి నిష్పక్షపాతంగా పంటలు నష్టపోయిన రైతులను గుర్తించాలన్నారు. పరిశీలన బృందాలలో అధికారులు, సిబ్బందితోపాటు రైతు సంఘం, కౌలు రైతుసంఘాల ప్రతినిధులను భాగస్వాములను చేయాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వంలో అనుసరించిన ఉచిత పంటల బీమా రైతులకు వర్తింపజేయాలన్నారు. ఇలాంటి ప్రకృతి వైపరీత్యాల సందర్భంగా పంటలబీమా రైతులను ఆదుకుంటుందని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం రైతుల భాగస్వామ్యం పేరుతో అనుసరించిన పంటలబీమా విధానంలో పథకం ఉపయోగపడదని తెలిపారు. పంటలకు ఉచిత పంటలబీమా అమలు చేయాలని కోరారు. ప్రభుత్వం తక్షణమే దెబ్బతిన్న అన్ని ఆహార పంటలకు ఎకరాకు రూ.25వేలు, వాణిజ్య పంటలు, ఉద్యాన పంటలకు ఎకరాకు రూ. 50వేలు నష్టపరిహారం ఇవ్వాలని, రైతులు కౌలు రైతులు అందరికీ పరిహారం ఇచ్చి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి.దస్తగిరిరెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి అన్వేష్ పాల్గొన్నారు.

డిసెంబర్ నాటికి కిచెన్ షెడ్లు పూర్తి చేయాలి

- కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి



మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి

ప్రజాశక్తి - కడప

జిల్లాలో పైలెట్ ప్రాజెక్టుగా అమలైన సెంట్రలైజ్డ్ స్మార్ట్ కిచెన్ షెడ్ల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తిచేసి డిసెంబర్ నాటికి అన్ని మండలాల్లో నిర్వహణలోకి తీసుకురావాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో యూనిక్‌గా ఏర్పాటు కానున్న సెంట్రలైజ్డ్ స్మార్ట్ కిచెన్ షెడ్స్ భవన నిర్మాణాల పురోగతిపై సోమవారం రాత్రి కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో అన్ని డివిజన్ల ఆర్‌డిఒలు, సంబంధిత అధికారులతో విసి ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పైలెట్ ప్రాజెక్టుగా స్మార్ట్ కిచెన్ల ఏర్పాటు చేపట్టామని, ఇప్పటికే జిల్లాలో కడప నగరం, సికె దిన్నెలలో స్మార్ట్ కిచెన్ ద్వారా ప్రభుత్వం అమలు చేస్తున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని మరింత శుచిగా, రుచికరంగా, తాజాగా విద్యార్థులకు అందిస్తున్నామన్నారు. ఈ స్మార్ట్ కిచెన్లు రాష్ట్రానికి ఆదర్శంగా ఉన్నాయని తెలిపారు. ఇదే స్ఫూర్తితోనే జిల్లాలో నూతనంగా 33 స్మార్ట్ కిచెన్ షెడ్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు, అందులో ఇప్పటికే 23 స్మార్ట్ కిచెన్ల నిర్మాణ పనులు ప్రారంభమై వివిధ దశల్లో పనులు పురోగతిలో ఉన్నాయన్నారు. మిగిలిన 10 స్మార్ట్ కిచెన్ల షెడ్ల నిర్మాణ పనులను కూడా రెండు రోజుల్లో ప్రారంభించాలన్నారు. ఇందులో స్థల కేటాయింపు, ఇసుక, కంకర సంబంధించి సమస్యలు ఉన్నట్లయితే రెవెన్యూ అధికారులు పరిష్కరించాలని ఆదేశించారు. స్మార్ట్ కిచెన్ లో ఏర్పాటు చేసే పరికరాల కోసం టెండర్, కొనుగోలు మొదలైన అంశాలపై సమీక్షించారు. స్మార్ట్ కిచెన్ల ద్వారా అందిస్తున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని పాఠశాలల్లో వంద శాతం మంది విద్యార్థులు తింటున్నారా?, లేదా? అందులో నాణ్యత విషయమై వారి తల్లితండ్రుల నుండి ర్యాండంగా అభిప్రాయాలను కూడా సేకరించాలన్నారు. స్వయం సహాయక సంఘాల ద్వారా స్మార్ట్ ఫార్మింగ్ ఏర్పాటుకు ఆయా మండలాల్లో సదుపాయాలను సమకూర్చాలని సూచించారు. కూరగాయల తోటల పెంపకం, కొనుగోలు సంబందిత అంశాలపై ఎపి సిఎన్‌ఎఫ్, డిఆర్‌డిఎ అధికారులు సమన్వయంతో ప్రణాళికలు రూపొందించాలన్నారు. సమావేశంలో సిపిఒ హజరతయ్య, జడ్‌పి సిఇఒ ఓబులమ్మ, డిఇఒ శంషుద్దీన్, స్మార్ట్ కిచెన్ల పర్యవేక్షకులు జోయల్ విజయకుమార్, నేచురల్ ఫార్మింగ్ జిల్లా మేనేజర్ ప్రవీణ్ కుమార్, డిఆర్‌డిఎ, డ్వామా, హౌసింగ్ పీడీలు రాజ్యలక్ష్మి, ఆదిశేషారెడ్డి, రాజరత్నం, పిఆర్ ఎస్ఇ మద్దన్న, , సమగ్ర శిక్ష ఎపిసి నిత్యానంద రాజు, సంబంధిత ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

ఆదర్శపుత్రుడు సంపత్ కుమార్ : విసి



సంపత్ కుమార్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న విసి రాజశేఖర్

ప్రజాశక్తి - కడప అర్బన్

'తెలుగు సూర్యుడు' సి.పి.బ్రౌన్ నివసించిన బంగళా స్థలాన్ని బ్రౌన్ స్మారక గ్రంథాలయ ఏర్పాటుకు ఇస్తానని సి.ఆర్.కృష్ణస్వామి ఇచ్చిన మాటను నిలబెట్టిన ఆదర్శపుత్రుడు సి.కె.సంపత్ కుమార్ అని యోగి వేమన విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య బెల్లంకొండ రాజశేఖర్ పేర్కొన్నారు. యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో సి.పి.బ్రౌన్ స్మారక గ్రంథాలయ స్థలదాత సి.కె.సంపత్‌కుమార్ 85వ జయంతి స్మారకోపన్యాసం సోమవారం నిర్వహించారు. తొలుత అతిథులంతా కలిసి స్థలదాత సి.కె.సంపత్ కుమార్ చిత్రపటానికి పూలమాల సమర్పించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విసి మాట్లాడుతూ గ్రంథాలయ నిర్మాణానికి 20 సెంట్ల స్థలమివ్వడమే కాక, సి.పి.బ్రౌన్ మెమోరియల్ ట్రస్టుకు అధ్యక్షులుగా సేవలందించి, సంస్థ అభివృద్ధిలో క్రియాశీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. గ్రంథాలయ నిర్మాణానికి కావాలసిన నిధులను సేకరించడం కోసం డాక్టర్ జానమద్ది హనుమచ్ఛాస్త్రితో కలసి అనేక ప్రాంతాలు తిరిగి తోడ్పాటు నందించారన్నారు. యోగి వేమన విశ్వవిద్యాలయం ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ ఆచార్య పి.పద్మ మాట్లాడుతూ మద్రాసు రాజధానిగా ఉన్నప్పుడు తెలుగువారంతా వ్యాపారం, విద్య, ఇతర అవసరాల నిమిత్తం మద్రాసుకు వెళ్లే రోజుల్లో మద్రాసు నుంచి కడపలో నివాసం ఉండడానికి వచ్చిన ఘనత సంపత్ కుమార్ తండ్రి కృష్ణస్వామికి దక్కుతుందన్నారు. 1976లో ఆచార్య జి.ఎన్.రెడ్డి, బంగోరె, ఆరుద్ర, ఆచార్య కేతు విశ్వనాథ రెడ్డి కలసి బ్రౌన్ నివసించిన బంగళా శిథిలాలను గుర్తించి, ఆ స్థానంలో బ్రౌన్ స్మారక గ్రంథాలయం ఏర్పాటు చేయాలని అప్పటి కలెక్టర్ డాక్టర్ పి.ఎల్.సంజీవరెడ్డిని కోరడంతో దాని నిర్మాణానికి బీజం పడిందన్నారు. సభాధ్యక్షులు, సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య జి.పార్వతి మాట్లాడుతూ సంపత్ కుమార్ కుమార్తె సి.ఎస్.సుప్రజ మరో 5 సెంట్లు గ్రంథాలయానికి బహూకరించడం ఆ కుటుంబానికి ఉన్న దాతృత్వ గుణానికి ప్రతీక అన్నారు. అనంతరం అతిథులు వక్త ఆచార్య పి.సి.వెంకటేశ్వర్లును ఘనంగా సత్కరించారు. కార్యక్రమాన్ని సహాయ పరిశోధకులు డాక్టర్ భూతపురి గోపాలకృష్ణశాస్త్రి, డాక్టర్ చింతకుంట శివారెడ్డి సమన్వయం చేశారు. కార్యక్రమంలో యోగి వేమన విశ్వవిద్యాలయం పాలకమండలి సభ్యులు ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి, సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సలహామండలి సభ్యులు జానమద్ది విజయభాస్కర్, నాగరాజు, ఎస్‌కెఆర్ అండ్ ఎస్‌కెఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల అధ్యాపకులు, విద్యార్థినులు, సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం గ్రంథాలయ సహాయకులు ఎన్.రమేశ్‌రావు, జి.హరిభూషణరావు, జయరామిరెడ్డి, ఎస్.ఎండి. బాషా పాల్గొన్నారు.



డిఆర్‌ఒకు వినతి పత్రం అందజేస్తున్న యుటిఎఫ్ నాయకులు

సచివాలయ ఉద్యోగులను

తక్షణం రిలీవ్ చేయాలి : యుటిఎఫ్


ప్రజాశక్తి - కడప అర్బన్

మెగా డిఎస్‌సి-2025కు ఎంపికైన సచివాలయ ఉద్యోగులను తక్షణమే రిలీవ్ చేయడానికి చర్యలు తీసుకోవాలని యుటిఎఫ్ జిల్లా శాఖ నాయకులు కోరారు. సోమవారం కలెక్టరేట్‌లో డిఆర్‌ఒ ఎం.విశ్వేశ్వర నాయుడును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా పలువురు గ్రామ సచివాలయాలలో పంచాయతీ కార్యదర్శులుగా, వార్డ్ వెల్ఫేర్ అధికారులుగా పనిచేస్తూ మెగా డిఎస్‌సి-2025లో ఉపాధ్యాయ పోస్టుకు ఎంపికయ్యారన్నారు. ఉపాధ్యాయులుగా నియామకం పొంది నెల రోజులైనప్పటికీ సంబంధిత అధికారులు రిలీవింగ్ ఆర్డర్స్ ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నా రన్నారు. మెగా డిఎస్‌సిలో ర్యాంకులు సాధించి ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారన్నారు. వారందరికీ రాష్ట్ర ప్రభుత్వం 2025, అక్టోబర్ 3 నుంచి 10 వరకు 8 రోజులపాటు శిక్షణ నిర్వహించిందని తెలిపారు. జిల్లా పంచాయతీ అధికారి కలెక్టర్ దృష్టికి తీసుకుని వెళ్లి, వారి ఆదేశాల మేరకు రిలీవింగ్ ఆర్డర్స్ ఇస్తామని చెప్పారని తెలిపారు. ఇంతవరకు దానిపై ఎటువంటి చర్యలు తీసుకోలేదని పేర్కొన్నారు. వీరి సమస్యను తక్షణం పరిష్కరించేందుకు, వారికి రిలీవ్ ఉత్తర్వులు ఇప్పించేందుకు కలెక్టర్ చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ట్రెజరర్ కె.నరసింహారావు, జిల్లా కార్యదర్శి ఎస్.ఏజాస్ అహ్మద్, జిల్లా కార్యవర్గ సభ్యులు బత్తుల చంద్రశేఖర్, గాజులపల్లి గోపీనాథ్ పాల్గొన్నారు.

శ్రీచరణి ప్రతిభ దేశానికి, కడప జిల్లాకు గర్వకారణం

ప్రజాశక్తి- జమ్మలమడుగు : శ్రీ చరణి ప్రతిభ దేశానికి, కడప జిల్లాకు గర్వకారణమని ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, జమ్మలమడుగు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జి భూపేష్ సుబ్బరామిరెడ్డి సోమవారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లోని కడప జిల్లా ఎర్రమల్లె గ్రామానికి చెందిన లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్ నల్లపురెడ్డి శ్రీ చరణి భారత మహిళల క్రికెట్ జట్టులో మెరిసిందన్నారు. ఐసిఐసి మహిళా వరల్డ్ కప్ 2025లో భారత్ విజేతగా నిలవడంలో కీలక పాత్ర పోషించి చరిత్ర సృష్టించిందన్నారు. పేదరికం, కుటుంబ అడ్డంకులు, కష్టాలన్నింటినీ ఎదుర్కొంటూ మారుమూల గ్రామం నుంచి అంతర్జాతీయ స్థాయికి ఎదిగిన చరణి ఆంధ్రప్రదేశ్ నుంచి ప్రపంచ కప్‌లో ఆడిన మొట్టమొదటి మహిళా క్రికెటర్‌గా నిలిచిందన్నారు. ఫాస్ట్ బౌలింగ్‌తో మొదలైన ఆమె ప్రయాణం స్పిన్ బౌలింగ్‌తో సక్సెస్ అయ్యిందన్నారు. కుటుంబ అప్పులు, ఆర్థిక ఇబ్బందులు ఉన్నా, తల్లిదండ్రుల సహకారం ప్రోత్సాహంతో తన కల నెరవేర్చుకున్న చరణి, దేశానికి గర్వకారణంగా నిలిచిందన్నారు. ఈ సందర్భంగా ఆమెకు, ఆమె కుటుంబానికి అభినందనలు తెలిపారు.

క్రికెట్ జట్టు విజయం చారిత్రాత్మకం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవి

ప్రజాశక్తి - కడప అర్బన్ : ఐసిసి ప్రపంచ మహిళా క్రికెట్ పోటీలలో భారత జట్టు చారిత్రాత్మక విజయం సాధించడం అభినందనీయమని కడప ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ మాధవి అన్నారు. సోమవారం ద్వారకా నగర్ లోని ఎమ్మెల్యే కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భారత మహిళా జట్టు అద్భుతమైన ప్రతిభతో ప్రపంచానికి మహిళా శక్తిని నిరూపించారని పేర్కొన్నారు. అత్యంత గర్వకారణం ఏమిటంటే ఈ విజయంలో మన కడప జిల్లా అమ్మాయి శ్రీచరణి భారత జట్టులో భాగమై మెరిసిందని చెప్పారు. ఆమె ప్రదర్శనతో దేశాన్ని గెలిపించారని పేర్కొన్నారు. మన జిల్లా నుంచి ప్రపంచ స్థాయికి ఎదిగి భారత్ గెలుపులో భాగమై నిలిచినందుకు ఆమెకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. భవిష్యత్తులోనూ మహిళా క్రీడాకారిణులు ప్రపంచ వేదికపై మరింతగా రాణించేందుకు ప్రభుత్వం నుంచి సహాయ సహ కారాలు అందేలా చూస్తామని చెప్పారు. మన కడపలో ఉన్న ప్రతిభావంతులైన క్రీడాకారులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో టిడిపి నగర అధ్యక్షులు మన్సూర్ అలీఖాన్, టిఎన్‌ఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు బొజ్జ తిరుమలేష్, మైనార్టీ సెల్ రాష్ట్ర నాయకులు జిలాని బాష, పాలకొండ దేవస్థానం చైర్మన్ రెడ్డయ్య యాదవ్ పాల్గొన్నారు.

కేసులు పెట్టడం టిడిపికి అలవాటే

ప్రజాశక్తి - కడప : మాజీ మంత్రి జోగి రమేష్‌పై కేసులు పెట్టి అక్రమంగా అరెస్టు చేయడం దుర్మార్గమని వైసిపి నాయకులు, మాజీ ఎమ్మెల్సీ ఎస్.వి. సతీష్‌రెడ్డి అన్నారు. సోమవారం కడపలోని ఆపార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. లిక్కర్ స్కాం చేసే వ్యక్తులు చెప్పిన మాటల ఆధారంగా అరెస్టు చేయడం అన్యాయమన్నారు. టిడిపి నాయకులే స్కాములు చేయడం, మళ్లీ కేసులు పెట్టడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. రాష్ట్రంలో తుపాన్ వల్ల ప్రజలు, రైతులు అల్లాడుతుంటే సిఎం చంద్రబాబు, ఆయన కుమారుడు మంత్రి లోకేష్ విదేశీ పర్యటనలు చేయడం సిగ్గు చేటన్నారు.

కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



వినతి పత్రం అందజేస్తున్న
రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటసుబ్బయ్య

ప్రజాశక్తి- కడప అర్బన్

కడప జిజిహెచ్‌లో పనిచేస్తున్న శానిటేషన్ కార్మికులు, సెక్యూరిటీ కార్మికులు, సూపర్‌వైజర్ల సమస్యలు పరిష్కరించాలని ఆప్కాస్ అవుట్ సోర్సింగ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటసుబ్బయ్య కోరారు. సోమవారం కడప జిజిహెచ్ సూపరింటెండెంట్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ కడప జిజిహెచ్‌లో అక్టోబర్ 1 నుంచి పద్మావతి హౌస్ కీపింగ్ సర్వీసెస్ వారికి కాంట్రాక్టు వచ్చిందని తెలిపారు. వారు వచ్చినప్పటి నుంచి కార్మికులను, సూపర్‌వైజర్లను తొలగిస్తామని, కొత్తవారిని పెట్టుకుంటామని నెలరోజులుగా భయభ్రాంతులకు గురి చేస్తున్నారని చెప్పారు. అర్హత పేరుతో సూపర్‌వైజర్లను, వయోపరిమితి పేరుతో వర్కర్లను తొలగిస్తామని ఇక్కడ ఇన్‌ఛార్జి అని చెప్పుకుంటున్న సురేష్, వెంకటరెడ్డి కార్మికులను భయపడిస్తున్నారని పేర్కొన్నారు. డ్యూటీ విషయంలో కూడా ఉదయం ఏడు గంటలకు రావాలి, మధ్యాహ్నం మూడు గంటలకు వెళ్లాలి, మధ్యాహ్నం 12 గంటలకు రావాలి, రాత్రి 8 గంటలకు వెళ్లాలి, రాత్రి 8 గంటలకు రావాలి, ఉదయం 8 గంటలకు వెళ్లాలి అనే హుకుం జారీ చేస్తున్నారని తెలిపారు. కార్మికులు పది రోజులు డ్యూటీ చేస్తే ఒక సెలవు ఇస్తాం, నెల మొత్తం మూడు సెలవులు మాత్రమే ఇస్తాం, మిగతా ఎటువంటి సెలవులు ఇవ్వం, అడిగితే తొలగిస్తాం అని చెబుతున్నారని పేర్కొన్నారు. ఇలాంటి వ్యవహారంలో ఉన్న కాంట్రాక్టర్ కార్మికులకు చెందాల్సిన పిఎఫ్, ఇఎస్ఐ సక్రమంగా అమలు చేస్తాడనే నమ్మకం పూర్తిగా పోయిందన్నారు. జిజిహెచ్‌లో పనిచేస్తున్న సెక్యూరిటీ కార్మికులకు అగ్రిమెంట్ ప్రకారం వేతనాలు ఇవ్వడం లేదని, ఇప్పటికే రెండు నెలల వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొన్నారు. గతంలో వేతనం చాలా తక్కువగా వేశారని తెలిపారు. ఇప్పుడైనా రూ. 13,960 వేతనం ఇవ్వాలని కోరారు. భయభ్రాంతులకు గురిచేస్తున్న కాంట్రాక్టర్‌కు వ్యతిరేకంగా మంగళవారం ఉదయం ఏడు గంటలకు నిరసన కార్యక్రమం ఉంటుందని సూపరింటెండెంట్‌కు తెలిపారు. ఆందోళనల్లో కార్మికులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. **'పద్మావతి'పై చర్యలు తీసుకోవాలి..** కడప జిజిహెచ్‌లో 15 ఏళ్లుగా పనిచేస్తున్న శానిటేషన్ సూపర్‌వైజర్లను అకారణంగా తొలగించిన పద్మావతి స్వీపింగ్ మేనేజ్మెంట్ సర్వీసెస్ ఏజెన్సీపై చర్యలు తీసుకోవాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్, నగర అధ్యక్షులు చంద్రారెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టర్‌కు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వినతి పత్రం అందజేశారు. కార్మికులను తొలగిస్తామని మౌఖికంగా చెప్పి యాజమాన్యం ఇబ్బందులు గురి చేయడం సరైంది కాదని తెలిపారు. క్వాలిఫికేషన్ పేరుతో కాసుల పంటగా మార్చుకునే ప్రయత్నించడం సరికాదన్నారు. పనిచేస్తున్న కార్మికులను కొనసాగించాలని కోరారు. స్పందించిన కలెక్టర్ జిజిహెచ్‌లో పనిచేస్తున్న కార్మికులను, సూపర్‌వైజర్లను ఎవరిని తొలగించమని స్పష్టం చేశారు. సిఐటియు నాయకులు కలెక్టర్‌కు ధన్య వాదాలు తెలిపారు.కార్యక్రమంలో నాయకులు ఉదయ్, కార్మికులు పాల్గొన్నారు.

.జిల్లా యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడిగా సయ్యద్ అబ్దుల్ రౌఫ్



ప్రజాశక్తి - కడప అర్బన్

జిల్లా యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులుగా సయ్యద్ అబ్దుల్ రౌఫ్‌ను నియమించారు. ఈ మేరకు సోమవారం రాష్ట్ర యువజన అధ్యక్షులు రామారావు రామారావు నియామక పత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా సయ్యద్ అబ్దుల్ రౌఫ్ మాట్లాడుతూ భారత రాజ్యాంగ రక్షణ కోసం, దేశ సమైక్యత, సమగ్రతను కాపాడడం కోసం అహర్నిశలు పాటుపడుతున్న రాహుల్ గాంధీ పోరాట పటిమకు ఆకర్షితుడైనట్లు పేర్కొన్నారు. తన నియామకానికి సహకరించిన యూత్ కాంగ్రెస్ జాతీయ ఇన్‌ఛార్జి మనిష్ శర్మ, యూత్ కాంగ్రెస్ జాతీయ అధ్యక్షులు ఉదయ్‌భాను చిబ్, పిసిసి అధ్యక్షులు షర్మిల, ఆంధ్రప్రదేశ్ యువజన కాంగ్రెస్ ఇన్‌ఛార్జి జాతీయ ప్రధాన కార్యదర్శి లెనిన్ ప్రసాద్, జాతీయ కార్యదర్శి మమతా నాగిరెడ్డి, రాష్ట్ర అధ్యక్షులు లక్కరాజు రామారావు, కడప జిల్లా అధ్యక్షులు విజయ జ్యోతికి అన్ని నియోజకవర్గాల ఇన్‌ఛార్జులకు అనుబంధ సంఘాల నాయకులకు, కార్యకర్తలు, స్నేహితులు, శ్రేయోభిలాషులు ప్రతి ఒక్కరికి పేరుపేరునా హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలకు ఆట వస్తువులు వితరణ

ప్రజాశక్తి-కాశినాయన : మండలంలోని కరణంవారిపల్లె ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు సోమవారం వివేకానంద ఫౌండేషన్ సంస్థ ఆధ్వర్యంలో క్యారంబోర్డ్, వాలీబాల్, స్కిప్పింగ్ బాల్స్, చెస్ వంటి ఆట వస్తువులను వితరణ చేశారు. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపకుడు పాపిజెన్ని రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు మానసిక ఉల్లాసానికి ఆటలు ముఖ్యమన్నారు. చిన్ననాటి నుంచే క్రమశిక్షణ కలిగి ఉండాలని విద్యార్థులకు సూచించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్లాస్టిక్ వల్ల కలిగే అనర్థాలను విద్యార్థులకు తెలియచేసి చేతి గుడ్డ సంచులను పంపిణీ చేశారు. అనంతరం రామకృష్ణారెడ్డి చేస్తున్న సేవలను అభినందిస్తూ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గానుగపెంట రమణారెడ్డి, ఉపాధ్యాయుడు ఈరి బాలజోజి శాలువా, పూలమాలతో సత్కరించారు.



ఆటవస్తువులు వితరణ చేస్తున్న దాత రామకృష్ణారెడ్డి

29,30న బాలోత్సవం

ప్రజాశక్తి - కడప అర్బన్

ఈ నెల 29, 30తేదీల్లో పెద్దఎత్తున బాలోత్సవం నిర్వహిస్తున్నామని, మూడవ బాలోత్సవం పిల్లల పండుగ కాదని, భావి భారత పౌరుల పండుగ అని జిల్లా అధ్యక్షులు గోపాల్ తెలిపారు. సోమవారం ఎస్.వి. ఇంజినీరింగ్ కళాశాలలో బాలోత్సవంపై నెలవారీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పిల్లవాడిలో ఏదో ఒక నైపుణ్యం ఉంటుందని, వాటిని వెలికి తీసేదే కడప బాలోత్సవం ఉద్దేశమని తెలిపారు. ఈ నెల 29, 30 తేదీల్లో కడప మరియాపురం గర్ల్స్ హై స్కూల్లో కడప బాలోత్సవం మూడవ పిల్లల పండుగ నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. విద్యార్థులు కడప బాలోత్సవం మూడవ పిల్లల పండగలో పాల్గొనాలని తెలిపారు. గౌరవ అధ్యక్షులు నాగమణిరెడ్డి మాట్లాడుతూ పిల్లలు భూమ్మీదకు సమస్త దుఃఖాన్ని చెరపడానికొస్తారని చెప్పారు. పెద్దల ప్రపంచానికి రంగులేయడానికొస్తారని పేర్కొన్నారు. మనల్ని ముందుకు నడపడానికొస్తారని తెలిపారు. మన కోసం ఓ అందమైన ప్రపంచాన్ని సృష్టిస్తారని పేర్కొన్నారు. ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ రాహుల్ మాట్లాడుతూ అందరి సహకారంతో మూడవ పిల్లల పండుగకు సిద్ధమయ్యామని తెలిపారు. మూడవ పిల్లల పండుగను జయప్రదం చేయడంలో సహకారాన్ని అందించాలని కోరారు.

ఆలయాల వద్ద పటిష్ట భద్రతా చర్యలు

ప్రజాశక్తి - కడప అర్బన్

జిల్లాలోని ప్రముఖ ఆలయాల వద్ద కార్తీక సోమవారం నేపథ్యంలో ఎస్‌పి షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు పోలీస్ అధికారులు, సిబ్బంది పటిష్ట భద్రతా చర్యలు చేపట్టారు. పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకునే ఆలయాలైన ఖాజీపేట పరిధిలోని నాగనాథేశ్వర స్వామి ఆలయం, మైలవరం పరిధిలోని అగస్తేశ్వర స్వామి ఆలయం, పులివెందుల పరిధిలోని నామాలగుండు సిద్దేశ్వర స్వామి ఆలయం, జమ్మలమడుగు పరిధిలోని కన్నెతీర్థం ఆలయాల వద్ద ఎలాంటి ఘటనలకు తావు లేకుండా ఆలయ కమిటీ నిర్వాహకులతో మాట్లాడి కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. క్యూ లైన్‌లు సజావుగా సాగేలా మైక్ అనౌన్సుమెంట్ ద్వారా, మెగా ఫోన్స్‌తో ఎప్పటికప్పుడూ భక్తులను అప్రమత్తం చేసేలా ఏర్పాట్లు చేశారు. పటిష్టమైన బారికేడింగ్ ఉండేలా తగిన చర్యలు తీసుకున్నారు. ఇతర శాఖలైన దేవాదాయ, విద్యుత్, పంచాయతీ, పురపాలక అధికారులతో సమన్వయం చేసుకుంటూ పోలీస్ అధికారులు విధులు నిర్వర్తించారు. ఆలయాల్లో సిసి కెమెరాల ద్వారా నిఘా ఉంచారు. చైన్ స్నాచింగ్, జేబు దొంగతనాలు చోటు చేసుకోకుండా క్రైమ్ పార్టీ బృందాలను రంగంలోకి దించారు. వేకువ జామున వెళ్లే భక్తుల భద్రతను దృష్టిలో ఉంచుకుని నైట్ బీట్లను, బ్లూ కోల్ట్స్, రక్షక్ బృందాలను అప్రమత్తం చేశారు. ఆలయాల వద్ద ఉదయం, సాయంత్రం అత్యాధునిక డ్రోన్ కెమెరాల ద్వారా నిఘా ఉంచారు. ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా పోలీస్ అధికారులు, సిబ్బంది సురక్షితంగా దర్శనం చేయించారు.

నేడు కందుల శివానందరెడ్డి 5వ వర్ధంతి

ప్రజాశక్తి - కడప అర్బన్ : మాజీ ఎమ్మెల్యే కందుల శివానందరెడ్డి 5వ వర్ధంతి కెఎస్‌ఆర్‌ఎం ఇంజినీరింగ్ కళాశాల ఆవరణంలో నిర్వహిస్తున్నట్లు కెఎస్‌ఆర్‌ఎం కళాశాల ప్రిన్సిపల్ టి.ఎన్. ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. వర్ధంతి సందర్భంగా 2024 కెజి సెట్లో టాప్ ర్యాంకులు సాధించి కెఎస్‌ఆర్‌ఎం కళాశాలలో చదువుతున్న 101 మంది విద్యార్థులకు నగదు బహుమతులు, ఉచిత స్కాలర్ షిప్‌లు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 9 గంటలకు కందుల శివానందరెడ్డి విగ్రహానికి పూల మాలలు వేసి ఘన నివాళులు అర్పించే కార్యక్రమం ఉంటుందని తెలిపారు. అనంతరం రక్తదాన శిబిరం, ఉచిత ఐ క్యాంపు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. అన్నదానం కూడా ఉంటుందన్నారు. సాయంత్రం 7.30 గంటల నుంచి గయోపాఖ్యానం యుద్ధసీను, భక్త చింతామణినాటక ప్రదర్శన ఉంటుందని తెలిపారు.

ఫిర్యాదుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి : ఎస్‌పి

ప్రజాశక్తి - కడప అర్బన్

ప్రజలు సమర్పించే ఫిర్యాదుల పట్ల ప్రత్యేక దృష్టి సారించి పరిష్కరించాలని ఎస్‌పి నచికేత్ షెల్కే విశ్వనాథ్ పేర్కొన్నారు. వైఎస్ఆర్ కడప జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఫిర్యాదుదారులతో ముఖాముఖి మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. మొత్తం 223 ఫిర్యాదులు వచ్చాయి. ఎస్‌పి ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించి, వాటిని పరిశీలించి సంబంధిత పోలీస్ అధికారులతో ప్రత్యక్షంగా ఫోన్‌లో మాట్లాడారు. చట్టపరమైన పరిమితులలో నిర్ణీత గడువులోపు వాటిని పరిష్కరించాలంటూ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. బాధితులకు న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పోలీస్ శాఖ ద్వారా పరిష్కారం అయ్యే ప్రతి ఫిర్యాదును ప్రజలు స్వేచ్ఛగా తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. ప్రజల నుంచి అందిన సదరు ఫిర్యాదులను నిర్ణీత సమయంలో చట్ట పరిధిలో పరిష్కరిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో వివిధ సమస్యలపై ప్రజలు తమ వినతులను విన్నవించుకున్నారు. వాటిపై సంబంధిత పోలీస్ అధికారులతో ఎస్‌పి నేరుగా మాట్లాడి సమస్యను చట్టపరిధిలో పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్‌పి (అడ్మిన్) కె.ప్రకాష్ బాబు, మహిళా పిఎస్ డిఎస్‌పి ఇ.బాలస్వామిరెడ్డి, డిటిసి ఎస్‌పి అబ్దుల్ కరీం పాల్గొన్నారు.

అర్జీదారులు సంతృప్తి చెందేలా పరిష్కారం: కలెక్టర్

ప్రజాశక్తి - కడప : ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా స్వీకరించిన అర్జీలకు నాణ్యమైన పరిష్కారం అందించాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సభాభవన్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా అర్జీల స్వీకరణ కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ శ్రీధర్ చెరుకూరితోపాటు డిఆర్‌ఒ విశ్వేశ్వర నాయుడు, వివిధ శాఖల జిల్లా అధికారులు హాజరై ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి మాట్లాడుతూ జిల్లా అధికారులు పెండింగ్ అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించి త్వరితగతిన పరిష్కారం అందించాలన్నారు. ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయికి స్వయంగావెళ్లి క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేసి, అర్జీదారుడు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువులోపు తప్పనిసరిగా పరిష్కరించాలన్నారు. అర్జీలు పెండింగ్ లేకుండా రీ ఓపెన్ కాకుండా జాగ్రత్త వహించాలని అధికారులకు సూచించారు. కింది స్థాయి అధికారులను పంపకుండా స్వయంగా అధికారే వెళ్లాలని అర్జీదారుడు సంతృప్తి చెందేలా అర్జీలను పరిష్కరించాలన్నారు. ఎండార్స్ ఇచ్చిన అర్జీలకు జిల్లా అధికారులు కచ్చితంగా పరిశీలించాలన్నారు. పిజిఆర్‌ఎస్ లో రీ ఓపెన్ అయిన అర్జీలను మరింత నాణ్యతతో పరిష్కరించాలని చెప్పారు. జిల్లా అధికారులు వచ్చిన అర్జీలను సమయం కేటాయించి రివ్యూ చేయాలన్నారు. ఎవరైనా అర్జీలపై నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. అలాగే అర్జీలు బియాండ్ ఎస్‌ఎల్‌ఎ లేకుండా చూడాలన్నారు. వివిధ శాఖల జిల్లా అధికారులతో పిజిఆర్‌ఎస్ పెండింగ్ అర్జీలపై సమీక్ష చేశారు. అనంతరం అర్జీదారుల నుండి వారు అర్జీలను స్వీకరించారు. కొండాపురం మండలం చౌటుపల్లి గ్రామానికి చెందిన వెంకట నాగలక్ష్మి తాను అంబేద్కర్ గురుకుల పాఠశాలలో సూపర్‌వైజర్‌గా పని చేస్తున్నానని, ఇటీవల ఉద్యోగం నుంచి తొలగించారని, తనకు ఎంఎ బిఇడి క్వాలిఫికేషన్ ఉన్నందున ఏదైనా కాంట్రాక్ట్ ప్రాదిపతికన టీచర్ ఉద్యోగం ఇప్పించాలని కోరారు. చెమ్ముమియా పేటలోని అబ్దుల్ రౌఫ్ ఐడియల్ గ్లోబల్ స్కూల్‌లో తమ ఇద్దరి కూతుర్లను చేర్పించామని, కొన్ని అని వార్య కారణాలవల్ల మార్చామని, కానీ వారు టిసి ఇవ్వకుండా ఇబ్బందికి గురి చేస్తున్నారని పేర్కొన్నారు. డిఇఒ చెప్పినా టిసి ఇవ్వడంలేదని, తమ పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎస్‌డిసి వెంకటపతి, జడ్‌పి సిఇఒ ఓబులమ్మ, మెప్మా పీడీ కిరణ్ కుమార్, డిఆర్‌డిఎ పీడీ రాజ్యలక్ష్మి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రమిస్తున్న ప్రజాప్రతినిధులు, దాల్మియా బాధితులు

రెండవ యూనిట్‌కు అనుమతులివ్వొద్దు

ప్రజాశక్తి - జమ్మలమడుగు

దాల్మియా రెండవ యూనిట్‌కు అనుమతులు ఇవ్వొద్దని మైలవరం జడ్పీటీసీ మహాలక్ష్మి, తలమంచిపట్నం ఎంపిటిసి బి.ఉదయిని, నవాబుపేట నాయకుడు రవీంద్రారెడ్డి కలెక్టర్ చెరుకూరు శ్రీధర్‌ను కోరారు. కలెక్టర్ కార్యాలయంలో సోమవారం వారు మాట్లాడుతూ అలుగు వంక వరద ప్రవాహానికి అడ్డంగా దాల్మియా నిర్మించడం వల్ల దుగ్గనపల్లి, నవాబుపేట గ్రామాలు ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందన్నారు. దాదాపు 500 ఎకరాల పంట పొలాలు మునిగిపోతాయన్నారు. సమస్య పరిష్కారానికి దాదాపు 700 మీటర్ల పొడవునా కాలువను తవ్విస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారన్నారు. కార్యక్రమంలో దాల్మియా బాధితులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంవిఐ వెంకట ప్రసాద్

ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యతనివ్వాలి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

ప్రయాణికుల భద్రతకు అత్యంత ప్రాధాన్యతనివ్వాలని ఎంవిఐ వెంకటప్రసాద్ పేర్కొన్నారు. పులివెందుల ఆర్టీవో కార్యాలయంలో సోమవారం ఆయన ప్రయివేట్ వాహన, పాఠశాలల యజమానులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంవిఐ మాట్లాడుతూ బస్సులను ఏ విధంగా నడపాలి.. ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనే దానిపై వివరించారు. ప్రతి బస్సుకు ఎమర్జెన్సీ ద్వారం ఉండాలన్నారు. లైసెన్స్ కలిగిన డ్రైవర్లను నియమించుకోవాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడుపరాదన్నారు. ప్రమాదాలు సంభవించినప్పుడు డ్రైవర్లు, క్లీనర్లు వెంటనే స్పందించి ప్రయాణికులను సురక్షితంగా కాపాడాలన్నారు. నిబంధనలను పాటించని వాహనాలను సీజ్ చేస్తామని ఆయన హెచ్చరించారు.

ఇళ్ల నిర్మాణం మరచిన ప్రభుత్వం

ప్రజాశక్తి - వేంపల్లె

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 17 నెలలైనా ఒక్క ఇల్లు కూడా పేదలకు నిర్మించలేదని పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి విమర్శించారు. సోమవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ మాజీ ప్రధాని ఇందిరాగాంధీ 1975లోనే 20 సూత్రాల ఆర్థిక కార్యక్రమంలో పేదలకు ఇళ్ల నిర్మాణానికి ప్రాముఖ్యతనిచ్చారని తెలిపారు. ఈ స్ఫూర్తితో 2004-2014 మధ్య ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ ప్రభుత్వాలు పేదలకు దాదాపు 60 లక్షల ఇళ్లు నిర్మించి ఇచ్చారని తెలిపారు. ఇళ్ల నిర్మాణానికి పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్ల స్థలం మంజూరు చేస్తామని కూటమి నాయకులు హామీ ఇచ్చారని గుర్తు చేశారు. కూటమి తన ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలు ఇంతవరకు అమలుకు నోచుకోలేదని పేర్కొన్నారు. ఇప్పటికైనా పేదలకు ఇళ్ల నిర్మాణంలో, మహిళా సంక్షేమం విషయంలో మేనిఫెస్టోలో చెప్పిన విధంగా అమలు చేయాలని తులసిరెడ్డి కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

మెరుగైన వైద్యం అందించాలి

ప్రజాశక్తి - జమ్మలమడుగు



సింగం శివమోహన్‌రెడ్డి

తెలంగాణ రాష్ట్రం రంగారెడ్డి జిల్లా మీర్జాగూడ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారికి ఆ ప్రభుత్వం మెరుగైన వైద్యం అందించాలని జమలమడుగు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి సింగం శివమోహన్‌రెడ్డి సూచించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ రంగారెడ్డి జిల్లా బస్సు ప్రమాదంలో 19 మంది ప్రయాణికులు చనిపోవడం అత్యంత బాధాకరమన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. తెలుగు రాష్ట్రాల్లో బస్సులను అన్ని రకాల ఫిట్‌నెస్ చూడాలని డ్రైవర్లకు సూచించాలన్నారు.

విద్యార్థులకు నైపుణ్య పోటీలు

ప్రజాశక్తి - చాపాడు (మైదుకూరు)

సమగ్ర శిక్షా అభియాన్ ఆధ్వర్యంలో వృత్తి విద్య విభాగం వారు నైపుణ్య పోటీలను నిర్వహించారు. మైదుకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉన్న మూడు వృత్తి కోర్సులు ఎలక్ట్రానిక్స్ ట్రేడ్లకు చెందిన విద్యార్థులు ఈ పోటీల్లో తమ ప్రతిభను ప్రదర్శించారు. కార్యక్రమాన్ని వృత్తి శిక్షకులు సమన్వయం చేయగా, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఇలియాస్ అహ్మద్ ప్రత్యేకంగా ప్రోత్సహించారు. వృత్తి శిక్షకులు బోడిపల్లి తేజ, జెర్రీ గురుమోహన్, మధురిమ సమన్వయం చేశారు. అన్ని ట్రేడ్ల బృందాలు తమ వర్కింగ్ మోడల్స్‌ను ప్రజెంట్ చేశాయి. ప్రతిభ చూపిన బృందాలు జిల్లాస్థాయి పోటీలో పాల్గొంటాయి.



వర్కింగ్ మోడల్స్‌ను పరిశీలిస్తున్న సిబ్బంది

క్రైం కార్నర్

ఘర్షణ కేసులో 20 మందిపై కేసులు నమోదు

ప్రజాశక్తి - వేంపల్లె

స్థానిక గాజులపేట సమీపంలో జరిగిన ఘర్షణ కేసులో ఇరువర్గాలకు చెందిన 20 మందిపై కేసులు నమోదు చేసినట్లు సిఐ నర్సింహులు తెలిపారు. తూపల్లె గ్రామానికి చెందిన టిడిపి నేత గోపినాథ్‌రెడ్డికి అలిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన జగనన్న మిషన్ అడ్వైజర్ రాఘవరెడ్డి మధ్య పరస్పర అరోపణల నేపథ్యంలో ఆదివారం రాత్రి గాజులపేట వద్ద ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగింది. ఈ నేపథ్యంలో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఇరువురు ఫిర్యాదులు చేసినట్లు సిఐ తెలిపారు. రాఘవరెడ్డి ఫిర్యాదు మేరకు 5 మందిపై, గోపీనాథ్‌రెడ్డి ఫిర్యాదు మేరకు 15 మందిపై కేసులు నమోదు చేసినట్లు సిఐ తెలిపారు.

అసైన్డ్ లబ్ధిదారులకు భూములు చూపించాలి

నకిలీ రికార్డులు సృష్టించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి : సిపిఎం

ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం

మండలంలోని సోమిరెడ్డిపల్లె గ్రామపంచాయతీ 1397 సర్వే నెంబర్‌లోని అసైన్డ్ లబ్ధిదారులకు భూములను సర్వే చేసి చూపాలని సిపిఎం మండల కార్యదర్శి గండి సునీల్‌కుమార్ డిమాండ్ చేశారు. ఆ మేరకు సోమవారం సిపిఎం మండల కమిటీ తహశీల్దార్‌కు వినతి పత్రమిచ్చింది. అనంతరం సునీల్‌కుమార్ మాట్లాడుతూ ఆ భూములకు సంబంధించి నకిలీ రికార్డులు సృష్టించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. 2007లో అప్పటి ప్రభుత్వం భూ పంపిణీలో భాగంగా అసైన్‌మెంట్ కమిటీ ద్వారా 1397 సర్వే నెంబర్‌లో ఎస్సీ, బీసీ, ఓసి సామాజిక వర్గాల్లో భూమిలేని పేదలకు పట్టాలు మంజూరు చేసిందన్నారు. తర్వాత కాలంలో పాలకులు, అధికారుల నిర్లక్ష్యంతో పట్టాలకు సర్వే చేసి భూములను చూపించలేదని వివరించారు. ప్రభుత్వాలు మారిన ప్రతిసారి వాటికి సంబంధించిన నాయకులు బోగస్ రికార్డులతో ఆన్‌లైన్ చేయించుకున్నారని తెలిపారు. నిజమైన లబ్ధిదారులు ఆన్‌లైన్ కోసం ఏళ్ల తరబడి రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అక్రమార్కులకు మాత్రం రాజమార్గంలో రికార్డులు సృష్టించారని తెలిపారు. ఇలాంటి అధికారులను వెంటనే సస్పెన్షన్ చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే అనేక దపాలుగా నకిలీ రికార్డులతో బ్యాంకుల రుణాలు కూడా పొందారని ఆరోపించారు. వెంటనే 1397 సర్వే నెంబర్‌లోని అసైన్డ్ లబ్ధిదారులకు భూములను ఆన్‌లైన్ చేయాలని కోరారు. పట్టాలకు కొలతలు వేసి హద్దులు చూపాలన్నారు. కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు సానా గోవిందస్వామి, రెబ్బ నరసింహులు, అజయ్‌కుమార్, లబ్ధిదారులు గురు బ్రహ్మాచారి, కటారు వెంకటరమణ, లక్ష్మిరెడ్డి, నాగసుబ్బరాయుడు పాల్గొన్నారు.



తహశీల్దార్‌కు వినతిపత్రమిస్తున్న సిపిఎం మండల కమిటీ

'ఉక్కు' సాధనే లక్ష్యంగా పోరాటాలు సాగిస్తాం



జెండా ఆవిష్కరిస్తున్న వీరనాల శివకుమార్

ప్రజాశక్తి - జమ్మలమడుగు

కడప ఉక్కు పరిశ్రమ సాధనే లక్ష్యంగా పోరాటాలు సాగిస్తామని, విభజన హామీల అమలు కోసం పోరుబాట తప్పదని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ తెలిపారు. డివైఎఫ్ఐ 46వ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకొని ఆయన ముద్దనూరు రోడ్డులో సోమవారం జెండా ఆవిష్కరించారు. ఎద్దుల ఈశ్వర్‌రెడ్డి విగ్రహం వద్ద నుంచి ర్యాలీ చేశారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు ప్రసాద్, జమ్మలమడుగు పట్టణ అధ్యక్షులు ఎల్లయ్య, పట్టణ ఉపాధ్యక్షులు సుబహాన్, పట్టణ నాయకులు కృష్ణారెడ్డి, సుదర్శన్, అరుణ్, మహేష్, రవీంద్ర, సురేష్ పాల్గొన్నారు.

బద్వేలు : స్వాతంత్ర్య సమరయోధులు యువతకు స్ఫూర్తి ప్రదాతలు భగత్ సింగ్, అల్లూరి సీతారామరాజు, చంద్రశేఖర్ ఆజాద్ వంటి అమరుల త్యాగాలబాటలో పయనిద్దామని, కడప ఉక్కు సాధనే లక్ష్యంగా యువతకు ఉపాధి లక్ష్యంగా పోరాటాలు సాగిద్దామని డివైఎఫ్ఐ జిల్లా ముడియం చిన్ని తెలిపారు. డివైఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకొని సోమవారం బద్వేల్ పట్టణంలో డివైఎఫ్ఐ బద్వేల్ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో పట్టణ అధ్యక్షులు ఎస్.కె.మస్తాన్ షరీఫ్ ఆధ్వర్యంలో ఆర్‌టిసి బస్టాండ్ దగ్గర ఉన్న భగత్ సింగ్ విగ్రహం వద్ద, నాలుగు రోడ్ల సర్కిల్‌లో డివైఎఫ్ఐ జెండాను ఆవిష్కరించారు. పట్టణ అధ్యక్షుడు ఎస్.కె మస్తాన్ షరీఫ్ అధ్యక్షత హించారు. కార్యక్రమంలో బద్వేల్ పట్టణ బద్వేల్ రూరల్ అధ్యక్షులు ముడుమాల ఓబుల్‌రెడ్డి, పట్టణ ఉపాధ్యక్షులు చాపలి సుధాకర్, గుర్రంపాటి రమణారెడ్డి, అబ్దుల్ అజీజ్, అబ్దుల్ నవాబ్, ఆదిత్య, కె.వి దీక్షిత్ రెడ్డి, కృష్ణ, మనీష్ రెడ్డి, రియాజ్, నాయబ్ పాల్గొన్నారు.

ఉద్యోగ, ఉపాధి కల్పన కోసం పోరాడుదాం

ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) : కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమ సాధనే లక్ష్యంగా పోరాటాలు సాగిస్తామని, విభజన హామీల అమలు కోసం పోరుబాట తప్పదని డివైఎఫ్ఐ ప్రొద్దుటూరు పట్టణ కార్యదర్శి విశ్వనాథ్ తెలిపారు. డివైఎఫ్ఐ 46వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని సుందరయ్య కాలనీలో డివైఎఫ్ఐ జెండాను విశ్వనాథ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివైఎఫ్ఐ 1980 పంజాబ్ రాష్ట్రంలోని లూథియానాలో ఏర్పాటైందన్నారు. అందరికీ విద్య, అందరికీ ఉపాధి లక్ష్యంతో ముందుకు సాగుతున్నామన్నారు. నాటి నుండి నేటి వరకు సమరశీల పోరాటాలు సాగిస్తూ నిరుద్యోగుల పక్షాన నిలబడి, హక్కుల కోసం పోరాటాలు చేస్తున్నామన్నారు. డివైఎఫ్ఐ ప్రొద్దుటూరు పట్టణ నాయకులు శ్రీను, చిన్న, రమణ, దినేష్, సుమంత్, చెర్రీ, అక్షయ పాల్గొన్నారు.



ప్రొద్దుటూరులో నినాదాలు చేస్తున్న డివైఎఫ్ఐ నాయకులు

ఆక్రమణను అడ్డుకున్న రెవెన్యూ అధికారులు



పూడ్చేందుకు కానుగుంతలో తోలిన మట్టి

ప్రజాశక్తి - వేంపల్లె

మండలంలోని కుమ్మరాంపల్లె పంచాయతీ పరిధిలోని ప్రభుత్వానికి చెందిన కానుగుంత ఆక్రమణను సోమవారం రెవెన్యూ అధికారులు అడ్డుకున్నారు. కుమ్మరాంపల్లె పంచాయతీ గండి రోడ్డులో పశువులు దాహం తీర్చుకునేందుకు పూర్వం సర్వే నెంబర్ 1147లో కానుగుంత తీశారు. ఇది ఎప్పుడు కూడా నీటితో ఉండేది. ఆ ప్రాంతంలో భూములను సాగు చేస్తున్న ఓ వ్యక్తి కానుగుంతను పూడ్చేందుకు జెసిబి యంత్రంతో మట్టిని తోలించాడు. ఈ విషయాన్ని గ్రామస్తులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. స్పందించిన తహశీల్దార్ హరినాథ్‌రెడ్డి ఆ ప్రాంతానికి వెళ్లి పనులను నిలిపేశారు. తన భూమిలో కానుగుంత ఉందని ఆ వ్యక్తి తహశీల్దార్‌తో విదించాడు. ప్రభుత్వానికి చెందిన సర్వే నెంబర్ 1147లో 20 సెంట్లులో కానుగుంత ఉందని, సర్వే చేసిన తర్వాత పనులు చేయాలని తహశీల్దార్ ఆదేశించారు. నిబంధనలకు వ్యతిరేకంగా గుంతను పూడ్చితే కేసులు నమోదు చేస్తానని ఆయన హెచ్చరించారు.

ఇలా ఉంటే కార్యాలయాలకు ఎలా వెళ్లేదీ..!

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

ఎర్రగుంట్ల మున్సిపాలిటీ కార్యాలయానికి వెళ్లే రహదారి బురద మయంగా ఉంది. పనుల నిమిత్తం వెళ్లే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మార్కెట్ యార్డులో మున్సిపల్ కార్యాలయం, అర్బన్ ప్రభుత్వ వైద్యశాల ఉన్నాయి. నిత్యం రోగులు వందల సంఖ్యలో ఆస్పత్రికి వెళుతూంటారు. వారు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. పన్నులు చెల్లిం చేందుకు, ఇతర అవసరాల నిమిత్తం ప్రజలు మున్సిపాలిటీ, మెప్మా కార్యాలయానికి ఎక్కువ సంఖ్యలో ప్రజలు, విధుల నిమిత్తం ఉద్యోగులు వెళుతూంటారు. అధ్వానంగా ఉన్న ఆ రోడ్డులో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాహన దారులు, పాదచారులు వాపోతున్నారు. వర్షాలతో రహదారిలోని గుంతల్లో నీరు నిలిచి, బురదగా తయారైందని, వెళ్లాలంటే తీవ్ర అసౌకర్యంగా ఉందని ఆవేదన చెందుతున్నారు. రోడ్డు ఇలా ఉంటే మెప్మా కార్యాలయానికి తాము ఎలా వెళ్లాలని శివలీల, భవాని బురదను చూపారు. అధికారులు స్పందించాలని, రోడ్డు బాగు చేయాలని ఉద్యోగులు, ప్రజలు కోరుతున్నారు.




బురద రోడ్డులో అవస్థలు పడుతున్న ఉద్యోగులు, ప్రజలు

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రజాశక్తి - చాపాడు

చాపాడు మండల పరిధిలోని నక్కలదిన్నె ఫీడర్‌లో మరమ్మతుల కారణంగా మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఎఇ రామభద్రయ్య తెలిపారు. మైదుకూరు మండలం ఆదిరెడ్డిపల్లె 33కెవి సబ్ స్టేషన్, నంద్యాలంపేట సబ్‌స్టేషన్‌లో కూడా మరమ్మతులు చేపడుతున్నామన్నారు. మధ్యాహ్నం 2.30 నిమిషాల నుండి సాయంత్రం 6 గంటల వరకు సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. ఆయా సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్న గ్రామ ప్రజలు గమనించి, సహకరించాలని ఎఇ కోరారు.



పల్లకీసేవలో వీరభద్రస్వామి

చాపాడు: అల్లాడుపల్లె శ్రీవీరభద్రస్వామి దేవస్థాన ఆవరణలో రెండవ కార్తిక సోమవారం సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో విచ్చేశారు. ఆలయ చైర్మన్ పెరుగు వీర నారాయణ యాదవ్, ఇఒ శంకర్ బాలాజీ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేశారు. ఉత్సవమూర్తులకు పల్లకీసేవ, ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. మహిళలు కార్తిక దీపాలు వెలిగించారు. భద్రకాళి సమేత వీరభద్రస్వామి అన్నదాన సత్రం, ఆర్యవైశ్య, సర్వజన అన్నదాన సత్రాల్లో అన్నదానం చేశారు.

వేంపల్లెలో అన్నదానం

ప్రజాశక్తి - వేంపల్లె

స్థానిక బలిజ వీధిలోని గౌరిదేవి ఆలయం వద్ద సోమవారం అన్నదానం చేశారు. కార్తిక సోమవారం సందర్భంగా బలిజ సంఘం ఆధ్వర్యంలో ఆలయంలో మహిళలు ప్రత్యేక పూజలు చేపట్టారు. కార్యక్రమంలో బలిజ సంఘం అధ్యక్షుడు నంబూరు కులాయప్ప, కటిక చంద్రశేఖర్, కొత్తూరు రెడ్డయ్య, పద్మా రాజ్‌కుమార్, డాక్టర్ రంగయ్య, ఆరుశేర్ల సుబ్బరాయుడు, గాలి హరిప్రసాద్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



సమస్యలు వింటున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

అందుబాటులో ఉంటా.. అధైర్య పడకండి : ఎంపీ

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

ప్రతి ఒక్కరికి అందుబాటులో ఉంటా, ఎవరూ అధైర్య పడకూడదని కడప పార్లమెంటు సభ్యుడు వైఎస్ అవినాష్‌రెడ్డి తెలిపారు. సోమవారం తన నివాసంలో ఆయన ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వైసీపీ నాయకులు, కార్యకర్తలు ఎంపీని కలిసి సమస్యలను వివరించారు. అనంతరం ఎంపీ స్పందిస్తూ సమస్యల పరిష్కారానికి న్యాయపరమైన పోరాటం చేద్దామన్నారు. సంబంధిత అధికారులకు ఫోన్ చేసి సమస్యలను పరిష్కరించాలని కోరారు. కొద్ది రోజులు ఓపికతో ఉండాలని నాయకులకు, కార్యకర్తలకు సూచించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఏ వర్గ ప్రజలకూ న్యాయం జరగలేదన్నారు. అరాచకాలు తప్ప అభివృద్ధి లేదన్నారు.



సంతకాల సేకరణలో సతీష్‌రెడ్డి, నాయకులు

పిపిపి విధానంతో ఉచిత వైద్యం దూరం

ప్రజాశక్తి - వేంపల్లె

రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రయివేటీకరణ చేస్తే పేద ప్రజలకు నాణ్యమైన ఉచిత వైద్యం అందుబాటులోకి రాదని, పిపిపి విధానాన్ని తిప్పి కొట్టాలని వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సతీష్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక గాంధీ రోడ్డులో సోమవారం వైసిపి ఆధ్వర్యంలో చేపట్టిన కోటి సంతకాల సేకరణలో సతీష్‌రెడ్డి పాల్గొన్నారు. ప్రతి ఇంటింటికి వెళ్లి వైద్య కళాశాలలపై కూటమి ప్రభుత్వం చేసే వ్యతిరేక విధానాలను వివరిస్తూ వారితో సంతకాలను చేయించారు. పులివెందుల నియోజకవర్గంలో 70 వేల మందితో సంతకాలు చేపట్టాలని నిర్ణయించామన్నారు. తమకు ప్రజలందరూ మద్దతు పలుకుతున్నారని సతీష్‌రెడ్డి చెప్పారు. కార్యక్రమంలో జడ్పీటీసీ రవికుమార్‌రెడ్డి, మండల కన్వీనర్ చంద్రఓబుల్ రెడ్డి, రవిశంకర్ గౌడ్, రామచంద్రారెడ్డి, భారతి, బిఎస్ షేక్షావలి, బండల షకూర్, నరసింహ గౌడ్, ప్రసాద్, సులేమాన్, గణేష్, ముత్యాల ఆంజనేయులు, కొత్తూరు రెడ్డయ్య, డాక్టర్ రంగయ్య, బలిజ సంఘం అధ్యక్షుడు నంబూరు కులాయప్ప, కార్యకర్తలు పాల్గొన్నారు.



సంతకాల సేకరణలో వైసిపి మండల నాయకులు

సింహాద్రిపురం : మెడికల్ కాలేజీలను ప్రభుత్వ రంగంలోనే నిర్వహించాలని వైసిపి మండల కన్వీనర్ దేవిరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, వైసిపి రాష్ట్ర రైతు విభాగం నాయకుడు వెన్నపూస అరవింద్‌రెడ్డి కోరారు. మెడికల్ కళాశాలల పిపిపి విధానాన్ని నిరసిస్తూ సోమవారం సింహాద్రిపురంలో కోటి సంతకాల సేకరణ చేపట్టారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు బ్రహ్మానందరెడ్డి, కిషోర్‌రెడ్డి, రిషికేశవరెడ్డి పాల్గొన్నారు.



పనులు చేయిస్తున్న సర్పంచ్ పెద్దిరెడ్డి

ఆంజనేయ కొట్టాలులో డ్రైయినేజీ మరమ్మతులు

ప్రజాశక్తి - ఖాజీపేట

మండలంలోని ఆంజనేయ కొట్టాలు పంచాయతీలో డ్రైయినేజీ మరమ్మతులు సోమవారం ప్రారంభించారు. వర్షం వస్తే మురుగునీరు బయటకు వెళ్లే మార్గంలేక ప్రజలు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని సర్పంచ్ గోపిరెడ్డి పెద్దిరెడ్డి పనులకు శ్రీకారం చుట్టారు. పంచాయతీని అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నానని తెలిపారు. ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు చొరవ చూపుతానన్నారు. కార్యక్రమంలో గ్రామ సచివాలయ కార్యదర్శి, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు పింఛను పంపిణీ

సింహాద్రిపురం : అంకాలమ్మ గూడూరులో ఎట్టకేలకు ఎన్టీఆర్ సామాజిక పింఛన్‌ను సోమవారం పంపిణీ చేశారు. ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి పర్యవేక్షణలో చేపట్టారు. ఈనెల ఒకటినే పింఛన్ పంపిణీ చేయాల్సి ఉండగా ఆర్ఎస్‌కె అసిస్టెంట్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి రూ.6.25 లక్షల నగదుతో పరార య్యాడు. పింఛన్ పంపిణీ జరగలేదు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సోమవారం పంపిణీ చేశారు.